క్లుప్తంగా

నియామక పత్రాల అందజేత



నియామక పత్రం అందుకుంటున్న వలంటీర్

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పరిధిలో నూతనంగా ఎన్నికైన ఇద్దరు వలంటీర్లకు ఆ గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు వలంటీర్లు కృషి చేయాలన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



గంధ మహోత్సవంలో పాల్గొన్న ముస్లింలు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక ఖాజానగర్‌లో ఉన్న ఆస్తానయే–ఖాదిరియా దర్గా వద్ద ఆదివారం గంధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ పీఠాధిపతి ఖాజా అబుల్ ఇర్ఫాన్‌షా మహమ్మద్ అబ్దుల్ అజీజ్ ఖాలిది ఖాదరి ఆధ్వర్యంలో ఈ గంధ మహోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని దామరమడుగులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. ఆ పాఠశాలలో 1988–89వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు కలిసి సందడి చేశారు. యోగక్షేమాలను పంచుకుని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మహేష్, అమరేంద్రరెడ్డి, శ్యామ్, ఆనంద్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బృందావనం): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా విభాగ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని మైపాడు గేట్ సమీపంలోని కేపీఆర్ గ్రాండ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమానికి హాజరైన రాజ్యసభ మాజీ సభ్యుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేష్, మహాసభ చైర్మన్ రామకృష్ణ, సభకు విచ్చేసిన పెద్దలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన ప్రవీణ్ శంకర్, సభ్యులను అభినందించారు.

రక్తదానంతో ప్రాణదానం

నెల్లూరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ధనలక్ష్మీపురంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని మేయర్ స్రవంతితో కలిసి ఆదివారం ప్రారంభించారు. రక్తాన్ని రెడ్‌క్రాస్, నోవా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సేకరించారు. సొసైటీ అధ్యక్షుడు విజయభాస్కర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వేణుగోపాల్‌రెడ్డి, రక్తదాన మోటివేటర్ భాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కాయిన్స్ ప్రదర్శన

నెల్లూరు రూరల్: ముత్తుకూరు రోడ్డు పార్థసారథి నగర్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో నిర్వహిస్తున్న పురాతన కాయిన్స్, కరెన్సీ, స్టాంపుల ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. పాఠశాల డైరెక్టర్లు షణ్ముఖాచారి, వెంకటాద్రి పర్యవేక్షించారు. విజయవాడకు చెందిన న్యూమిస్మాటిక్ అండ్ ఫిలాటిక్ అసోసియేషన్ సభ్యుడు శ్రీధర్‌కు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుఖదా దాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు రూరల్: నగరంలోని 21వ డివిజన్లో గల ఉమ్మారెడ్డిగుంటలో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు సంబంధించిన శంకుస్థాపనను మేయర్ స్రవంతితో కలిసి వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదివారం చేపట్టారు. సమస్యల పరిష్కార విషయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు.

రైతులకు అండగా..

- కోవూరు నియోజకవర్గంలోని 4 మండలాల్లో 80 కాలువల్లో పూడికతీత
- కాలువల్లో బిరబిరా సాగుతున్న నీరు
- రబీ సీజన్ ప్రారంభంలోనే పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పూడికతీత తీయడంతో కాలువలో జోరుగా ప్రవహిస్తున్న సాగునీరు

కొడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తోంది. రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరందించడంతోపాటు వారి కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. సాధారణంగా పంటలకు సాగునీరు సమృద్ధిగా ఉంటే కర్షకులు పంట పండినంత ఆనందంగా ఉంటారు. సాగునీరు సంతృప్తికరంగా అందాలంటే కాలువలు ఎలాంటి అడ్డంకులు లేకుండా బాగుండాలి. ప్రస్తుతం కోవూరు నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఉంది. రబీ సాగు ఆరంభంలోనే సాగునీటి కాలువల్లో పూర్తిస్థాయిలో పూడిక తీశారు. దీంతో సాగునీటి కాలువల్లో నీరు బిరబిరా సాగుతోంది. దీంతో చివరి ఆయకట్టు రైతులు కూడా పంట చివరి వరకు సాగునీటికి ఎలాంటి ఢోకా లేదన్న ధైర్యంతో ఉన్నారు.

రబీ ఆరంభంలోనే పూడికతీత పనులు

కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు, విడవలూరు, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లోనే రబీ(తొలి) సీజన్‌లో లక్ష ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారు. సాగునీటి కాలువలు సక్రమంగా లేకుంటే సోమశిల జలాశయంలో సమృద్ధిగా నీరున్నా రైతులకు ఇబ్బందులు తప్పవు. కాలువలకు తగినంత నీటిని విడుదల చేసినప్పటికీ పూడికతో నిండి ఉండడం వల్ల మధ్యలో అడ్డంకులు ఏర్పడి చిన్న కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు వెళ్లే నీరు సవ్యంగా సాగదు. తగినంత నీరందక మోటార్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గత ప్రభుత్వంలో కాలువల పూడికతీత పనులు చేయనందున రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. తలమంచి, దామేగుంట, విడవలూరు మండలం రామతీర్థం తదితర గ్రామాల్లో చివరి ఆయకట్టు రైతులు పైడేరు వాగులో మోటార్లు ఏర్పాటు చేసుకుని సాగునీటిని సరఫరా చేసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం సోమశిల జలాశయంలో సమృద్ధిగా నీరున్నందున పంటకు సాగునీరు పుష్కలంగా అందించాలన్న ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కీలకమైన రబీ సాగు ఆరంభంలోనే పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకొన్నారు.

రూ.3 కోట్ల నిధులతో పనులు

కాలువల్లో పూడికతీత నిమిత్తం ప్రత్యేక నిధులేవీ అందుబాటులో లేకపోయినప్పటికీ అత్యవసరంగా వినియోగించే నార్మల్ స్టేట్ ఫండ్ నిధుల నుంచి రూ.3 కోట్ల నిధులు ఖర్చు చేసి పూడికతీత పనులు చేయించారు. ఐదు లేదా పదెకరాలు మాత్రమే ఆయకట్టున్న చిన్న కాలువలను సైతం వదలకుండా పై నాలుగు మండలాల్లో 80 కాలువలను గుర్తించి అన్నింటినీ పూర్తిస్థాయిలో పూడిక తీశారు. దీంతో డెల్టాలోని చిన్న, పెద్ద సాగునీటి కాలువల్లో నీరు వేగంగా ప్రవహిస్తూ కన్పిస్తోంది. ఫలితంగా సాగునీటి విషయంలో ఎలాంటి బెంగ లేకుండా రైతులు నిశ్చింతగా ఉన్నారు.



ప్రధాన సాగునీటి కాలువైన తూర్పు కాలువలో ప్రవహిస్తున్న నీరు

నీరందదన్న బెంగ లేదు



సాగునీటి కాలువల్లో పూర్తిస్థాయిలో పూడిక తీసినందున చివరి ఆయకట్టుదారులకు సైతం ఎలాంటి బెంగ అవసరం లేకుండా పోయింది. కాలువలు పూడికతో నిండి ఉంటే సాగునీరు విడుదల చేసినప్పటికీ సక్రమంగా అందక ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కాలువల ద్వారా జోరుగా సాగునీరు అందుతోంది.

– తక్కెళ్లపాటి కళాకృష్ణ, రైతు, రాచర్లపాడు

గట్టెక్కాలంటే కాలువలే ప్రధానం



వరి పంట సాగు చేసి గట్టెక్కాలంటే కాలువలే ప్రధానం. కాలువలు సక్రమంగా లేకుంటే ఆందోళన తప్పదు. ఈ పరిస్థితి లేకుండా ముందే కాలువల్లో పూడికతీశారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి రైతుల తరఫున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

– కాకి శ్రీనివాసులు, రైతు, రామన్నపాళెం

అన్ని కాలువల్లో పూడిక తీశాం



రైతుల నుంచి నీరందడం లేదన్న ఫిర్యాదులు తలెత్తకుండా పూడికతీత చేపట్టాలని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఏ ఒక్క చిన్న కాలువను సైతం వదలకుండా అన్ని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాం. పంట ఆరంభం నుంచే పుష్కలంగా నీరందేలా యుద్ధప్రాతిపదికన పూడికతీసి రైతుల అవసరాలకు తగ్గట్టుగా సాగునీరందిస్తున్నాం. పైగా పూడికతీత సమయంలో ఆయకట్టు రైతులు దగ్గరుండి వారికి నచ్చినట్లుగా పూడిక తీయించుకున్నారు.

– పార్థసారథి, ఇరిగేషన్ ఏఈ, కొడవలూరు సెక్షన్

వేములమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేములమ్మ అమ్మవారు

మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో వెలసిన వేములమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రఘురామయ్య అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వేములమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి చెందులూరు వెంకయ్య – సుగుణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు చెందులూరు శ్రీనివాసులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సాయితేజ



బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్రస్థాయిలో జరిగే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని పెనుబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కూచి వెంకట శ్రీనివాస సాయితేజ ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం వెంకటరత్నం ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో సాయితేజ 'ఆటోమేటిక్ స్ట్రీట్ లైటింగ్' అనే అంశంపై ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శించాడని తెలిపారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగడంతోపాటు ఉదయం కాగానే అవి ఆరిపోయేలా ఈ ప్రాజెక్టును రూపొందించి ప్రతిభ కనబరిచాడని, అలాగే రాష్ట్రస్థాయిలో జరిగే ప్రదర్శనకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో సాయితేజ ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపికను అందుకున్నాడు. ఈ సందర్భంగా సాయితేజను మండల విద్యాశాఖాధికారి దిలీప్, ఉపాధ్యాయులు అభినందించారు.

శరవేగంగా శ్రీవారి రథం నిర్మాణ పనులు



రథం కోసం సిద్ధమవుతున్న విడిభాగాలు

- రూ.40 లక్షల వ్యయంతో రథం తయారీ

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెలసిన స్వామి, అమ్మవార్ల రథం తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.3.50 కోట్లతో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుని గతేడాది శిలాప్రతిష్ట జరిగింది. శ్రీవారి ఉత్సవానికి బలాస టేకుతో రథం రూపొందించేందుకు ఆలయ నిర్వాహకులు గతేడాది అక్టోబర్ 28వ తేదీ అంకురార్పణ చేశారు. రథం తయారీకి రూ.40 లక్షల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీంతో దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. ఈ రథం 23 అడుగుల ఎత్తు, 13 అడుగుల వెడల్పు, 15 అడుగుల పొడవుతో 350 కుంటల బలాస టేకుతో తయారు చేస్తున్నారు. గూడూరుకు చెందిన తయారీదారులు రథం రూపకల్పన పనులు చేస్తున్నారు.



శ్రీవారి రథం పనులు చేస్తున్న తయారీదారులు

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను మంగళవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హ్యావెల్స్ ఇండియా లిమిటెడ్, సంగీతా మొబైల్స్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ తదితర కంపెనీలకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రికల్, మెకానికల్, వెల్డర్), ఇంటర్, ఏదైనా డిగ్రీ వారు అర్హులని చెప్పారు. స్టోర్ మేనేజర్, క్యాషియర్, కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ప్రమోటర్స్, టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు ఎంపిక చేయనున్నారన్నారు.

తెగుళ్ల నివారణపై నేడు రైతులకు శిక్షణ

కొడవలూరు: వరి పంటను ఆశించే తెగుళ్ల, నివారణ చర్యలపై మండలంలోని తాటాకులదిన్నె, పాతవంగల్లు గ్రామాల్లో సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యవసాయ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాటాకులదిన్నెలో ఉదయం 10 గంటలకు, పాతవంగల్లులో మధ్యాహ్నం 12 గంటలకు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బైక్ గేదెను ఢీకొని..

వెంకటాచలం: బైక్ గేదెను ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. గూడూరు పట్టణానికి చెందిన సుబ్బారావు, మనోహర్ పనినిమిత్తం బైక్‌పై గూడూరు నుంచి కృష్ణపట్నంకు బయలుదేరారు. కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై సర్వేపల్లి సమీపానికి చేరుకోగానే గేదెలు అడ్డురావడంతో బైక్ గేదెను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావు, మనోహర్‌లకు గాయాలు కాగా చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



తోటపల్లిగూడూరు: కోడూరు వేళాంగిణి మాత చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి డైరెక్టర్, ఫాదర్ లోకేష్ రాజ్ భక్తులకు దైవసందేశం వినిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా సూచించారు. సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ, డీసీ, కేడీ, సస్పెక్టెడ్ షీటర్లకు ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు. రౌడీయిజం చేసినా.. ఘర్షణలకు పాల్పడినా సహించేదిలేదని స్పష్టం చేశారు. ప్రవర్తన మార్చుకొని సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలన్నారు. పాత వ్యవహారాలకు స్వస్తి పలికి పద్ధతిగా జీవిస్తున్నారని తెలిస్తే రౌడీషీట్లు తొలగించే అంశమై ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): హత్యాయత్నం కేసులో పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. క్రాంతినగర్ వద్ద గతేడాది సెప్టెంబర్ ఆరున నిర్వహించిన వినాయక నిమజ్జన ఊరేగింపులో అదే ప్రాంతానికి చెందిన లోకేష్‌కుమార్‌తో ఆటోనగర్, మనుమసిద్ధినగర్, పడారుపల్లి ప్రాంతాలకు చెందిన సాయికుమార్, జకీర్, చక్రధర్ గొడవపడ్డారు. స్థానికులు సర్ది చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి టిఫిన్ చేసేందుకు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వచ్చిన లోకేష్‌కుమార్‌పై నిందితులు దాడి చేశారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసును నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ – 2 డీఎస్పీ శ్రీనివాసరావు కేసు విచారణ చేపట్టారు. ఘటన జరిగిన కొద్దిరోజులకే సాయికుమార్, జకీర్‌ను అరెస్ట్ చేశారు. తాజాగా చక్రధర్‌ను డీఎస్పీ అరెస్ట్ చేశారు.

పాడి రైతులకు భరోసాగా నిలవాలి

- డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు



హరిశ్చంద్రారెడ్డిని అభినందిస్తున్న వీరి చలపతిరావు

కొడవలూరు: పాడి రైతులకు పాల సొసైటీ పాలకవర్గం భరోసాగా నిలవాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో విజయ డెయిరీకి అనుబంధంగా నిర్వహిస్తున్న పాల సొసైటీ నూతన అధ్యక్షుడిగా నైసా హరిశ్చంద్రారెడ్డిని పాలకవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన హరిశ్చంద్రారెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీరి చలపతిరావు మాట్లాడుతూ ఇప్పటివరకు సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగిన మహదేవరెడ్డి రాజీనామా చేయడంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు తెలిపారు. గతేడాది సొసైటీకి రూ.2.70 లక్షలు లాభం రాగా, ఆ మొత్తాన్ని తిరిగి సొసైటీకి పాలు పోస్తున్న రైతులకే లీటరుకు రూ.3 వంతున చెల్లించినట్లు తెలిపారు. ఒక్కో రైతుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అందజేసినట్లు తెలిపారు. పాల సేకరణ పెంచడం ద్వారా సొసైటీని లాభాల బాటలో నడిపించవచ్చన్నారు. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ప్రొక్యూర్‌మెంట్, ఇన్‌పుట్స్ మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కమిటీ అధ్యక్షుడు కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు గంగపట్నం జనార్దన్‌రెడ్డి, సీహెచ్ మధురెడ్డి, సొసైటీ పాలకవర్గ సభ్యులు శ్యామల, సుబ్బయ్య, జమాల్ పాల్గొన్నారు.

బీచ్‌లో సందర్శకుల సందడి



బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్‌లో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో కోడూరు బీచ్‌కు పర్యాటకులు పోటెత్తడంతో బీచ్‌లో కోలాహలంగా మారింది. జిల్లా నలువైపుల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు సముద్ర స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. ఉదయం 8 గంటలకే ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం వరకు కొనసాగాయి.

దొరువు ఆక్రమణపై నిరసన



ఆక్రమణలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం గ్రామంలో దొరువు ఆక్రమణపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. గంగపట్నం చీలు రోడు వద్ద ఉన్న దాబా నిర్వాహకులు పక్కనే ఉన్న దొరువును యంత్రాలతో పూడ్చివేయడాన్ని స్థానికులు అడ్డుకున్నారు. గ్రామంలోని కొన్ని వర్గాల వారు కర్మక్రతువులను ఇక్కడే జరుపుకుంటారు. వరదనీరు చేరడంతో పశువుల తాగునీటికి కూడా ఈ దొరువు ఉపయోగపడుతుందని గ్రామస్తులు తెలిపారు. దాబా నిర్వాహకులు రాత్రి సమయంలో జేసీబీ సాయంతో పూడ్చుకొంటూ వస్తున్నారన్నారు. మైపాడు ప్రధాన రహదారి పక్కనే ఉన్న దొరువును ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలకు తావిస్తోందని గ్రామస్తులు ఆరోపించారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటం చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

విష్ణాలయానికి సొబగులు



శిథిలావస్థకు చేరుకున్న విష్ణాలయం(ఫైల్)



ప్రస్తుతం కొత్త శోభను సంతరించుకున్న విష్ణాలయం

మనుబోలు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత విష్ణాలయం దాతల సహకారంతో కొత్త సొబగులు సంతరించుకుంది. మనుబోలు గ్రామం ప్రధాన రహదారి పక్కనే వున్న విష్ణాలయాన్ని క్రీ.శ.12 శతాబ్దంలో చోళ రాజుల కాలంలో నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతారు. కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయంపై చెక్కిన దేవతా మూర్తుల ఆకారాలు దెబ్బతినడమే కాకుండా పైన, గోడలపై పగుళ్లిచ్చి పిచ్చి మొక్కలు మొలిచాయి. ఎట్టకేలకు ఇటీవల దాతల సహకారంతో ఆలయానికి మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామానికి చెందిన పెనుగొండ సుధాకర్, బొమ్మిరెడ్డి కోటేశ్వరరెడ్డి, కలికి రమేష్‌రెడ్డి అర్చకుడు హనుమాచార్యులు సూచనల మేరకు దాతల సహకారంతో ఆలయానికి మరమ్మతు పనులు చేయించారు. పురాతన ఆలయానికి మరమ్మతు పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.